71

# తప్పుడు కాళ్లు కావాలి

చీకటి వెలుతురును భరించలేదు,

అబద్ధానికి నిజం ఎదుట నించోవాలంటే కాళ్ళు వణుకుతాయి.

తప్పుచేసిన మనిషికి తప్పుచేయని వాడిని చూచి నపుడు —తానిట్లా పాతాళంలో వుండగా అవతల మనిషి అట్లా అంత ఎత్తున హిమాలయం మీద వుండనేల అన్పిస్తుంది....ఆ హిమాలయాన్ని బద్దలుకొట్టి, పిండిచేసి ఆ మనిషిని తన స్థాయికి లాగి—"చూచావా! నువ్వేం నాకన్న గొప్ప కాదు. మనిద్దరమూ ఒక్క ఎత్తులో వాళ్ళమే సుమా" అని చెప్పాలని పించుతుంది. కాని హిమాలయం లాగే అవతల మనిషి మంచితనాన్ని నువ్వెన్నడూ బద్దలు కొట్టలేవు. అయితే-సామెతలో పిల్లివలె కళ్ళుమూసుకోవచ్చు. నీ కళ్ళవెనక చీకటిని లోకపు అంధకారంగా సమన్వయించుకోవచ్చు నీ అంతరాత్మకో "ఫ నాదార్బిటోన్" మాత్ర ఇవ్వవచ్చునంతే!

—— అని చెప్పాలని రాసిన కథ ఇది.

ఒక 'ఫ్రెండ్' ఒకనాడు—

తమ్ము తొలిచి వేస్తున్న ఆవేదన గురించి చెప్పబోయి ఒక వాక్యం మాత్రమే చెప్పి, ఇంకేమీ చెప్పక, చెప్పలేక "జీవితంలో ఇంకేనాడయినా మీకు పూర్తిగా చెప్పగలనేమో గాని నేడు మాత్రం కాదు" అన్నారు.... ఆ 'ఫ్రెండ్' చెప్పిన ఆ ఒక్కగా నొక్క వాక్యం గురించి ఆలోచించి ఆలోచించి, దాని వెనక దాగిన అగ్నిగోళాన్ని ఊహించి రాసిన కథ ఇది. ఈ నాటికీ నాకు నిజం తెలియదు గనుక ఈ కథ ఇతివృత్తానికీ ఆ 'ఫ్రెండ్' అనుభవానికీ ఎటు వంటి పోలికలూ లేవు అని నా ఆశ.

ఈ కథ మొదట వున్న నర్సింగ్ హోమ్, సముద్రం వగైరాలన్నీ మరొక సందర్భంలో నా జీవితంలోని ఒక అతి ముఖ్యమైన ఘట్టంలో తారసిల్లినవి. నేపథ్యం ఒక చోట, అనుభవం ఒకచోట—ఇట్లా వివిధ స్థలాలనుండి వివిధ కాలాలనుండి సేకరించిన వస్తువులతో ఒక కథను రూపొందించడానికి ఇది ఉదాహరణ

ఈ కథ రాసిన కొన్ని వారాల తర్వాత గాని దీనికి పేరు స్ఫురించలేదు నాకు

సాధారణంగా కథని స్థూలంగా మొదట అనుకుని ముందు పేరు రాసి తర్వాత కథను రాస్తాను నేను అయితే అందుకు భిన్నంగా ఈ కథలో వలె కథంతా రాశాక పేరు కోసం గింజుకోవడమూ కద్దు]

నర్సింగ్ హోము మేడమీద వెనకవైపు వరండాలో నిల్చుంటే సముద్రం కనపడుతూంది.

మధ్యాహ్నపు ఎండలో—నీలంగా మెరుస్తూంది సము

ద్రం. చైతన్యంతో ఉరకలు వేస్తూంది సముద్రం. తెల్లటి నురగలతో చప్పట్లు కొడుతూంది సముద్రం.

బాధగా, జీరగా. అరిచిందొక స్టీమరు. అటు చూశాడు మధుసూదనం, బోలెడు స్టీమర్లున్నాయి. హార్బర్లో చోటు లేక సముద్రంలోనే లంగరేసుకుని కూచున్నాయి. అడ్డంగా వున్న కొబ్బరి చెట్ల మధ్యలోంచి లెక్కపెడితే తొమ్మి దున్నాయి. రేవులో రెండు కాబోలు వున్నట్లున్నాయి. ఆ గొట్టాలని బట్టిచూస్తే.

నీటి గీతమీద చుక్కలాగ దూరంగా కనపడిందొక పడవ. దాని నిక్కడ మదరాసులో "కాటమరాన్" అంటారు. పొద్దున్నే వెళ్ళి బొద్దువాలేసరికి వస్తారు కాటమరాన్ వాళ్లు చేపలతో.

కుడి ప్రక్కగా ఉంది రాయపురంబీచి. అక్కడ ఇసుక విస్తీర్ణం తక్కువ. బేస్తవాళ్ళ హడావిడి ఎక్కువ. హైకోర్టు దగ్గరయితే ఇసుక పెద్ద మైదానంలా ఉంటుంది. మెరీనా బీచి లోనూ అలాగే ఉంటుందిగాని అక్కడ జనం ఎక్కువ. నాగరి కత ఎక్కువ.

అక్కడో స్విమ్మింగ్ పూల్ ఉంది. దాని ఒడ్డున హోటలుంది. మెరిసిపోతున్న పాలరాతి నేల. తెల్లటి యూని

షారాల తలపాగాల సర్వర్లు. మంద మందంగా వెలుగుతున్న దీపాలు. మెల్ల మెల్లగా మాట్లాడుతూ, గట్టి గట్టిగా నవ్వుతూ మధ్య మధ్య ఏవో తింటూ, కావలసిన పాటకోసం 'జూక్ బాక్స్'లో పావలా కాసును వేస్తున్న నాగరికులు.

ఆ హోటల్‌లో—ఎనిమిదేళ్ళ క్రిందట ఒక సాయం కాలం—"నువ్వు సూటు తొడుక్కుంటే బాగుంటావు" అంది కల్యాణి.

"నాకు నచ్చను—" అనగలిగాడు తను.

కల్యాణి తన చేతిలోవున్న సగం కొరికిన కేకుని లాక్కుంది. తను వారించబోతే ఆ ముక్కను నోట్లో వేసుకుని నవ్వింది. ఆ నవ్వు...!

"ఎల్లుండి ఆదివారం ఎగ్మోరు స్టేషన్ దగ్గరికి రా... మవుంట్ రోడ్ వెళ్ళి కొందాం—"

"ఏమిటి?" అని అడిగాడు,

"అదే... నల్లని సూటుకు బట్ట కొందాం,"

తను పలకలేదు కళ్యాణి; చూచింది.

ఆ చూపులో అధికారం ఉంది. ప్రాధేయం ఉంది. లావణ్యం ఉంది. లాలిత్యం ఉంది.

"కోపం వచ్చిందా మధూ."

ఆ అడగడంలో 'అమ్మ'వుంది. అలా అడిగించుకోవడంలో రాజరికం ఉంది. ఆ సామ్రాజ్యం అంతా తనదిగా చేసి—మత్తులో నిషాలో, ఎత్తులో, ఎనలేని అనుభవంలో ముంచెత్తుతుంది కల్యాణి.

తనేమి చెప్పగలడు?

కృతజ్ఞతనా? ప్చ్!!

"పోనీలే మధూ! నాకోసం ఒక్కసారి ఆ నల్ల సూటు తొడుక్కుంటావేమోనని అడిగాను. నీలే. నీకంతగా ఇష్టం లేకపోతే."

అంటూ ఆమె ముందుకు వంగింది. తన చేతికి ఆమె పెదాలు తగిలాయి: బెరుకుగా లాక్కున్నాడు చేతిని అది హోటలు గది! ఎంత తలుపుంటే మాత్రం!!

నవ్వుతూ మళ్ళీ వంగింది కల్యాణి. ఆమె మంగళ సూత్రం కనబడింది.

చురుక్కుమని తెంపమీద కొట్టినట్లయింది.

ఆమె వివాహిత. ఆమె డాక్టరు

తను గుమాస్తా. అవివాహితుడు.

హటాత్తుగా లేచాడు.

ఆమె ఆశ్చర్యపోయింది. వెంటనే బటన్ నొక్కింది.

రెండు నిముషాలకు సర్వర్ వస్తే బిల్ చెల్లించి బయట పడింది. గబగబ వెళ్ళి అతడి చేతిని పట్టుకుని ఆపింది.

"ఏమిటి మధూ, అలా వెళ్ళిపోతావు!"

ఇసుక మీద వెన్నెల ఐకమత్యంలాగున ఉంది. అతడామె కళ్ళల్లోకి చూచాడు. వెన్నెలమీద సరుగుడు చెట్ల నీడలు అభిప్రాయభేదాల్లా ఉన్నాయి.

గాలికి చెదిరిన ముంగురులను కల్యాణి సర్దుకుంటుంటే— అతడు వంగాడు.

"రా ... పోదాం" అని కారువైపు నడిచింది. అతడక్కడే నిలిచాడు. సముద్రపు హోరు ఇరవై గజాలలో ఉంది. అంతకన్న జోరుగా ఉంది అతడి మనసులోని హోరు.

కల్యాణి వెనక్కు వస్తూంది. పరుగెత్తి పోదామనిపించింది కాని పోలేదు.

"ఇంటికిరా. పోదాం ప్రొఫెసరుగారు కాన్ఫరెన్సుకని తిరువేంద్రం వెళ్లారు."

'ఛీ!' అనిపించింది ఆమె మాటలు వింటుంటే.

చెయ్యి విదిలించుకున్నాడు. గబగబా, ఇంచుమించు పరుగెత్తినట్లుగా నడిచాడు. ఆమె పిలిచింది. అరిచింది. కొంత దూరం వెనక నడిచింది.

అయినా—

అతను మగవాడు పాతికేళ్లు నిండనివాడు.

ఆమె ఆడది. ముప్ఫై దాటినది.

తను ఆమెను కనిపించుకోకుండా వెళ్ళిపోయాడు. ఆ రాత్రి—అలాగే నాలుగు రాత్రులు నిద్ర లేదు. ఆ వేదనలో పొర్లాడాడు.

ఏమిటి ఈ ఛండాలం? ఎందుకీ చీకటి మమత? తను ఆ హాస్పిటల్‌లోనే చేరి వుండకపోతే. తన నవల ఆమె చదివి ఉండకపోతే. తన కళ్ళల్లోని... అదే చోట... అది ఆమెకు నచ్చకపోతే ఆమె సర్వం అలా తనకు పిచ్చెక్కించకపోతే.

ఛీ! ఛీ! ఏమి మనిషి తను! ఎంత నీచుడు తను—నిప్పుల్లో మాడి వస్తే బాగుండును ... ఇంకో జన్మలోకి పోతే బాగుండును. తాను రోడ్డుమీద వెళ్తున్నంతసేపూ మంచి అబ్బాయిలా ఉంటుంది. ఈ బుద్ధి కాని బురదని చూసీ చూడగానే అందులోకి దిగిపోతుంది. ఆ మాత్రం బలంలేనిది ఎందుకొచ్చిన మంచి బుద్ధి... తనో పిరికిపంద. నిజాన్ని ఎదుర్కొనడానికి జంకుతున్నవాడు ఆశయాల చాటున. మాటల ఇరుకుల్లో, పుస్తకాల నీడల్లో—జీవితపు విలువల్ని విడిచేసిన సిగ్గులేని మనిషి—తను.

అని కుమిలిపోయాడు నాలుగు రోజులూ.

అయినో రోజు ఆఫీసుకు వెళ్లాడు. ఆ సాయంకాలం ఫోను మీద "నాకు పిచ్చెత్తినట్లుంది. ఆరింటికి 'మినర్వా' దగ్గరకు రావూ—" అని పిలిచింది ఆమె.

తాను వెళ్లాడు!

ఆరు నెలల తర్వాత నాన్న చెప్పిన అమ్మాయి—మాణిక్యాన్ని పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళి ఆహ్వానం ఆమెకు పంపడానికి ధైర్యం లేక పోయింది తనకు.

తిరుపతిలో పెళ్ళి జరిగింది. మొదటిసారిగా మాణిక్యాన్ని దగ్గరకు తీసుకోబోయినప్పుడు—ఆ పద్దెనిమిదేళ్ళ కన్య కళ్ళల్లోని ఉషఃకాంతుల్ని చూసినప్పుడు—తను చచ్చిపోతే బాగుండుననిపించింది. అప్పుడూ తను పిరికి పందే! "మాణిక్యం! నేను మసి బొగ్గుని. నీకు తగనివాడిని"—అని తెగించి అందామనుకున్నాడు. కాని అనలేక పోయాడు. ఆమె తన పాదాలంటి నమస్కరించింది. ఈ మురికి మనిషిని, ఈ దారి తప్పిన దానవుడిని ఆమె నెత్తిమీద ఉంచుకుంది. ఆమె మనిషి కాదు. తను మనిషే కాదు.

మదరాసునుండి బలవంతాన బదిలీ చేయించుకుని విజయనగరం వచ్చేశాడు తను. 'ఆమెకు' దూరంగా—దూర దూరంగా. ఆమెకు చెప్పకుండా వచ్చేశాడు.

...కాని తన నుండి తను ఎక్కడికి పోగలడు గనక!

నాలుగయిదేళ్ళ తర్వాత పత్రికలో చూశాడు అదేదో ప్రతినిధివర్గం నాయకురాలిగా కల్యాణి విదేశాలకు వెళ్ళడం ...తర్వాత కొన్ని నెలలకు ఆమె 'పోయిన' వార్త చదివాడు. పంజరంలో పక్షిలా కొట్టుకులాడింది మనస్సు.

కాని పాప పుట్టిపోవడం—రెండేళ్ళపాటు మాణిక్యం ఆరోగ్యం చెడిపోవడం—ఆ ఉద్యోగం వదలి వరంగల్ రావడం ——అప్పులు—ఇంకో రెండు నవలలు—అందులో ఒకదానిని పబ్లిషరు మింగడం——ఇవన్నీ కలిసి తన మనసుని కప్పివేశాయి. తన సున్నితత్వం, తన ఆవేదన, అడుగున పడిపోయాయి. తప్పొప్పుల త్రాసుమధ్య ముల్లులావుండిన తన మనసు మొద్దుబారి పోయింది. కాని బూడిద క్రింది నిప్పులా—ఎప్పుడన్నా కల్యాణి చురుక్కు-మనేది.

చెప్పేద్దాం—అని మాణిక్యం దగ్గరకు తీరా వెళ్ళితే ఇంకేదన్నా మాట వచ్చేది. నిజాయితీ కలవాడికి నిజం ఒక కవచమయితే—తప్పు చేసిన వాడిమీద నిజానికున్న అధికారం నియంతలాంటిది.

——కెవ్వున కేక వినిపిస్తే ఉలిక్కి-పడి వరండానుండి పరుగెత్తాడు మధుసూదనం. మాణిక్యం కళ్ళు మూసుకునేవుంది. తొమ్మిదో నెంబరు గదిలో ఆ పక్షవాతంవచ్చి నాయన కేక

పెట్టినట్లున్నాడు. కాస్సేపటికి ఆ గదిలోనుండి నర్సు వచ్చింది —చేతిలో సిరంజితో.

"డాక్టరు ఎప్పుడొస్తారు సిస్టర్?" అని అడిగాడు.

"ఇంకో అరగంటలో—" అంటూ వెళ్ళింది నర్సు.

మాణిక్యం నుదురు మీద ఈగ వాలితే దాన్ని తోలాడు నెమ్మదిగా ఆమె ముంగురులను సరిచేశాడు మధు.

"మణీ!"

తన హృదయమే పిలిచినట్లుంది. ఆమె మొహం దగ్గరగా మొహం పెట్టి చూశాడు. ఆ వదనంలోని ప్రశాంతత!! మంచితనం ఇట్లావుంది కాబోలు! సంఘర్షణలేని అంతరంగం ఇంత అందంగా వుంటుంది కాబోలు. అందమంటే చర్మం మీద కనపడేది కాదు. అద్దంలో అగుపడేది కాదు. మనిషి లోలోపలి భావనల పై రూపమే అందమేమో. దానికి అదే అందమేమో—

తాప్పాయని చప్పుడయితే మంచం ప్రక్కగా కూర్చున్నవాడల్లా లేచి నిల్చున్నాడు. అవతలి గదిలో ఆవిడ గ్లాసుని పగలగొట్టి నందుకు తన అబ్బాయిని తిడుతూంది.

మాణిక్యానికి నాలుగు రోజుల నుండి ఒంటిమీద స్పృహలేదు. గ్లూకోజ్ నీళ్లూ, పళ్ళరసమూ నోట్లోపోస్తే

మింగుతూంది. పొద్దున్నా సాయంకాలమూ. రక్తం ఎక్కిస్తు న్నారు.

బయటికి వచ్చాడు మధు. దారిలో నర్సింగ్ హోము పాకీవాడు కనపడి చిరునవ్వు నవ్వాడు. పొగాకు మురికిలో మునిగిపోయిన వాడి పలువరసచూస్తే అసహ్యం వేసింది. "అమ్మ ఎట్టా వుండాది సార్?" అని అడిగాడు.

బాగుందన్నట్లుగా తల ఊపాడు అతడు. వెనుకవైపు వరండాలోకి వెళ్ళి నిల్చున్నాడు. సూర్యుడు పడమటికి వాలి నట్లున్నాడు. కొంతదాక నల్లగా, ఆ తర్వాత నీలంగా పచ్చగా కనబడింది సముద్రం. అక్కడ కొన్ని పడవలూ అలాగే నిల్చుని వున్నాయి. పాపం. వాటికి రేవులో చోటులేదు—తప్పుచేసిన వాడి మనసుకు శాంతిలో చోటు లేనట్లుగా—అనుకుంది అతడి మనసు.

ఇందాక కనుపించిన 'కాటమరావ్' లేదు. ఒడ్డు చేరు కుంది కాబోలు.

పొద్దున్న డాక్టర్ని అడిగితే "ఇంకొక్క నాలుగు రోజులు ఓపికపట్టండి—" అన్నారు. నాలుగురోజులు! ఇవాళ శనివారం... పోయిన మంగళవారం రాత్రి ఇక్కడ మాణిక్యాన్ని చేర్చాడు. తామిద్దరమూ కలిసి కంచి వెళ్ళి

అక్కడనుండి మహాబలిపురం వెళ్తుండగా మాణిక్యానికి వచ్చింది ఆ జ్వరం. మెదడులో వాపు వుందేమో నన్నారు. ఎక్స్-రే తీశారు. సందేహం నివృత్తి కాలేదు. ఆపరేషన్ చేద్దామంటే ఒంటిలో సత్తువ చాలదు. ఇంకో నాలుగు రోజులలో ఆపరేషన్ జరుగుతుంది. అంతా తెలిసిపోతుంది—అనుకున్నాడు మధుసూదనం.

కాని—

ఆ రాత్రి ఒంటిగంటప్పుడు—నర్సు హడావిడిగా తడితే కళ్లు నులుముకుని లేచాడు మధు. డాక్టరు ఆక్సిజన్ పరికరంతో తంటాలు పడుతున్నాడు. మాణిక్యం తల పట్టుకున్నాడు అతను. చల్లదనం ఆవరిస్తూ ఉంది.

పెద్ద సుత్తితో నెత్తిన కొట్టినట్లు—

చీకటి వడగళ్ళ వానగా కురిసినట్లు—

మాణిక్య దీపం తటాలున ఆరిపోయినట్లు—అయింది.

"మాణిక్యం! ఇది విను! మన పెళ్లి కాకముందు నేను..." అని చెప్పేద్దామని కొట్టుకుంది అతడి హృదయం. కాని వినడానికి మాణిక్యం లేదు. మరి...వినడానికి ఆమె వున్నంత కాలం అతడి నాలుక శాపగ్రస్తమైన అహల్యలా వుండిపోయింది.

రోజులు గడిచాయి. అలాగే నెలలుకూడా.

కాని ఆ మచ్చ మనసుమీదనుండి తొలగలేదు. ఆ బరువు ఎదమీదనుండి కదలలేదు. ఏది చేసినా, ఎక్కడ వున్నా ఒక్కటే తలపు—అక్షయ తూణీరంలోనుండి బాణాలు కురిసినట్లు.

"ఆమె ఉదయిస్తున్న ఉదయం లాటిది. ఆమె ఆకాశాన్ని అంటుతున్న ధవళ శిఖరంలాటిది. మరి నువ్వో? నువ్వు పాపాలను దాచుకునే చీకటి రాత్రివి. వీధిలో ఎగురుతున్న ఎంగిలి విస్తరాకువి"

ఇదే తలపు. ఇదే నిష్ఠ. ఎలాగ దీనినుండి తప్పించుకోవడం—ఎలాగ అంతా మరిచిపోవడం? అంతా తెలుసు ననుకునే ఏమీ తెలియని రోజులలో—అందమూ ఆకర్షణా అందరాని ఆడంబరమూ అడగకుండా వచ్చి కల్యాణిగా తన చెయ్య పట్టుకు లాక్కెడితే—అందులో తన తప్పెంత? దేదీప్యమానంగా వెలుగుతున్న జ్యోతి ముందు శలభమెంత? సుడిగాలిమధ్య ప్రమిద బలమెంత?

అది ఎలా అయితేనేం—మరిచిపోలేనిది—జరిగింది. కాని ఆ తర్వాత తన జీవితంలోకి వచ్చిన ఈ మాణిక్యం అంత ఎత్తున వుండనేల? ఆమె సర్వస్వమని. దైవమని తన్ను ఆరాధించనేల? 'ఇదిగో! నీ ఆంతర్యంలో ఎంతటి అమావాస్య వున్నదో చూడు—' అన్నట్లుగా ఆ వ్యక్తి మనిషిగా దేవుడికి దగ్గరగా జీవించనేల?

ఇదంతా తన్నొక దోషిగా కలకాలం వేలెత్తి చూపించాలని ఎవరో చేశారు. ఆవేళే మాణిక్యం.

జరిగినదంతా చెప్పివేస్తే—మాణిక్యం ఏమీ అనేది కాదేమో—ఆమె క్షమాపణకూడా ఇంకో శాపంగా పరిణమించేదేమో? అయినా తానామెనుండి ఏదీ దాచని ధైర్యవంతుడని' ఋజువర్తనుడనీ చెప్పుకుని ఉండవచ్చు. కాని పిరికితనంకోసం కాలం ఆగదు. అవకాశం దాటిపోయింది. ఎలాగ బ్రతకడం... చచ్చిపోతే బాగుండును.

అనుకున్న మధు చచ్చిపోలేదు. బ్రతికే వున్నాడు. కాని చచ్చిపోయిన మాణిక్యం జీవితం అడుగున ఏవన్నా చీకటి గదులుండక పోవా అని ఆశ వెల్గించుకున్నాడు. ఎనిమిదేళ్ళపాటు తను అనవసరంగా క్రుంగిపోతూ ఆమె ఔన్నత్యాన్ని కల్పించుకున్నాడేమోనని ఆలోచించాడు. ఆమె వుత్తరాలన్నీ చదివాడు ఊళ్ళుతిరిగాడు. ఆమె తల్లిదండ్రులలో, అక్క-చెల్లెళ్ళలో, ఇతర బంధువులలో తనలాటి వారుండక పోరా అని అన్వేషణ ఆరంభించాడు.

ఏనాటికన్నా మాణిక్యమూ తనలాటి దోషియేనని, ఆమె వంశంలో వారి జీవితం ఒక్కటయినా తన జీవితానికి ప్రతి బింబంగా వుందనీ—ఆ జీవితానికన్నా తనదేమి తీసిపోతే

డనీ. తామందరమూ తప్పుచేసేవాళ్ళమనీ—అందరమూ ఒకే ఎత్తులోని వాళ్ళమేనని—

అని తన మనసుకు చెప్పుకు తిరగడానికి కావలసిన ఋజువు కోసం వెతుకుతూ వున్నాడతను ఇంకా!

('స్పైనిక్ సమాచార్—' 64)